

గూడెం హుండీ లెక్కింపు

దండేపల్లి: గూడెం సత్యనారాయణస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. రూ.9,53,921 ఆదాయం, 84 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి.


501 మంది గైర్హాజరు

మంచిర్యాలటౌన్: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు మంగళవారం 7,104 మందికి గాను 6,603 మంది హాజరుకాగా, 501 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 6,398 మందికి 5,974 మంది హాజరు కాగా 424 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 706 మందికి గాను 629 మంది హాజరు కాగా, 77 మంది గైర్హాజరయ్యారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. వడ గాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

శ్రీరామనవమికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గౌతమినగర్ కోదండ రామాలయంలో శ్రీరామనవమికి ఏర్పాట్లు చేశారు. సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం రాజేశ్ తెలిపారు. ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి వివరాలు వెల్లడించారు. 29న ఉత్సవమూర్తులతో ఎదుర్కోలు కార్యక్రమం, గౌతమినగర్ పురవీధుల గుండా స్వామివారి శోభాయాత్ర, 30న మధ్యాహ్నం 12:30 గంటలకు వేలాది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మెట్టుపల్లి కిషన్‌రావు, కోటిచింతల నరేంద్రరావు, అంకం చంద్రయ్య, కల్వల జగన్మోహన్‌రావు, సిరికొండ పద్మ, సిరికొండ కొండల్‌రావు, నాంపల్లి మాధవి, నాంపల్లి శ్రీనివాస్ రాంగోపాల్‌రావు, జయరామారావు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం పరిశీలన

జన్నారం: మండలంలో కలెక్టర్ సంతోష్ మంగళవారం పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళల వైద్య పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. దేవునిగూడ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరం సందర్శించారు. పల్లె ప్రకృతివనం, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. గ్రామంలో అభివృద్ధి పనులు బాగున్నాయని సర్పంచ్ శిరీషను అభినందించారు. కమాన్‌పల్లి గ్రామంలో మన ఊరు–మన బడి పాఠశాలలను పరిశీలించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ వెంకటకిషన్, ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో రమేష్, వైద్యాధికారి ఉమాశ్రీ, ఐకేపీ ఏపీవో రవీందర్, పోన్కల్ సర్పంచ్ భూమేష్, సోమనపల్లి హెచ్ఎం కమలాకర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తాండూర్: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని, యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తాండూర్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను డీసీపీ ప్రారంభించారు. తాండూర్ సర్కిల్ పరిధిలోని తాండూర్, భీమిని, కన్నెపల్లి యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు, విజేలకు బహుమతులు, మెమెంటోలు ప్రదానం చేశారు. బెల్లంపల్లి ఏసీపీ పి.సదయ్య, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, తాండూర్, బెల్లంపల్లిరూరల్ సీఐలు జగదీష్, రాజ్‌కుమార్‌గౌడ్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో, ఎస్సైలు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్య క్లినిక్‌లో చికిత్స తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: ప్రతీ మంగళవారం జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళలకు ప్రత్యేకంగా అందించే వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లాలోని కుందారం, జన్నారం, తాళ్లగురిజాల పీహెచ్‌సీలతోపాటు జిల్లా కేంద్రంలోని హమాలివాడ బస్తీ దవాఖానాలో మహిళలకు అందిస్తున్న చికిత్సలను డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



పాదయాత్రలో భట్టి విక్రమార్క, ప్రేంసాగర్‌రావు, సురేఖ, కాంగ్రెస్ శ్రేణులు

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపాలి

- కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యలు పరిష్కారం
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్

తాండూర్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రకు కొనసాగింపుగా 'భట్టి' చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర సోమవారం రాత్రి కుమురంభీం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించింది. తాండూర్ మండలం రేపల్లెవాడ వద్ద పార్టీ మండల అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా డోలు కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. మహిళలు కోలాటం ప్రదర్శించగా, ఆటపాటలతో పాదయాత్ర ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. జిల్లాలో తొలి రోజు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావడంతో జనసంద్రంగా మారింది. రేపల్లెవాడ నుంచి ఐబీ తాండూర్, ఇందిరానగర్, తంగళ్లపల్లి, కిష్టంపేట, బోయపల్లి బోర్డు, బోయపల్లి, కన్నాల రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు సాగిన పాదయాత్రకు ప్రజలు, కార్యకర్తలు మంగళహారతులతో బ్రహ్మరథం పట్టారు. పాదయాత్రలో భట్టి విక్రమార్క ప్రజలకు అభివాదం చేస్తూ, వారి సమస్యలు ఆలకిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామనే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పాదయాత్రలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యమ సమయంలో ఇంటికో ఉద్యోగాన్ని ఇస్తామని ప్రకటించిన కేసీఆర్ అధికారం అధికారం చేపట్టాక కనీసం ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. రైతుల రుణాలు మాఫీ చేయకుండా వంచించారని ఆరోపించారు. వడ్డీ వ్యాపారుల చేతుల్లో రైతులు నలిగిపోతున్నారని, అప్పుల ఊబిలో కూరుకుపోయి అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కనికరించకపోవడం శోచనీయమని అన్నారు. కోల్‌మైనింగ్ వనరులను ఆంధ్రా బడాబాబుల కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు.

భారీ ప్రదర్శన

పీపుల్స్‌మార్చ్‌లో కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 2 వేల మంది పాదయాత్రలో విక్రమార్క వెంట నడిచారు. అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా శ్రేణులు తరలిరావడంతో నూతనోత్సాహం కనిపించింది. భట్టి విక్రమార్క బెల్లంపల్లి మండలం కన్నాల శివారు ప్రాంతంలో బస చేశారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గట్టు మురళీధర్‌రావు, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బండి పోశం, సింగిల్ విండో చైర్మన్ రత్నాకర్‌రావు, మాజీ సర్పంచ్ సుభాష్, యూత్ నాయకులు పుట్ట శ్రీనివాస్, భీమ లింగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

భారీగా వినతులు

పాదయాత్రలో ప్రజలు సీఎల్పీ నేత విక్రమార్కకు సమస్యలు ఏకరువు పెడుతూ పోటాపోటీగా వినతిపత్రాలు అందజేశారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని రేపల్లెవాడ, కొత్తపల్లి, పెగడపల్లి గ్రామస్తులు వేడుకున్నారు. కొత్తపల్లి గ్రామ శివారులో 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల కోసం 196మందికి ఇంటి స్థలాలు ఇచ్చిందని, నిర్మాణాలు జరిగినా మౌలిక వసతులు కల్పించలేదని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సహకారం అందించాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులు విన్నవించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పనకు కృషి చేయాలని సామాజిక కార్యకర్త కామిని శ్రీనివాస్ కోరారు. సింగరేణిలో ఓసీపీలు వద్దని, భూగర్భగనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు విన్నవించారు. వినతిపత్రాలను పరిశీలించిన 'భట్టి' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని భరోసానిచ్చారు.

ఆర్టీఏ.. లక్ష్యాన్ని దాటేశారు !



మంచిర్యాల జిల్లా రవాణా శాఖా కార్యాలయం

- 108 శాతానికి చేరిన పన్నుల వసూలు
- రూ.60.50 కోట్లు ఆదాయం
- రాష్ట్రస్థాయిలో జిల్లా ముందంజ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా ఆర్టీఏ అధికారులు పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని దాటేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం విధించిన లక్ష్యం కంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేసి రాష్ట్ర స్థాయిలోనే ఐదో స్థానం లోపు ఉన్నా రు. సిబ్బంది కొరత ఉన్నా నిర్దిష్టమైన ప్రణాళికతో సాధారణ విధులతోపాటు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ ఏటా లక్ష్యాన్ని సాధిస్తున్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది 2023 మార్చి 31వరకు జిల్లా రవాణా శాఖకు ప్రభుత్వం రూ.55.86కోట్ల లక్ష్యాన్ని నిర్ధారించింది. నిరంతరం వసూళ్లు చేస్తూనే మార్చిలో వేగవంతం చేశారు. దీంతో గడువుకు ముందే వంద శాతం పన్ను వసూళ్లు దాటిసి 108శాతానికి చేరింది. రూ.60.50 కోట్లు వసూలు చేసింది. డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, డీటీఓ ఎల్.కిష్టయ్య పర్యవేక్షణలో సీనియర్ ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి, ఎంవీఐలు రాహుల్‌కుమార్, యోగేశ్వర్‌సింగ్, ఏఎంవీఐలు ప్రత్యూషరెడ్డి, శ్రీకాంత్, కొమ్ము శ్రీనివాస్ పన్నుల వసూళ్లలో విశేషంగా కృషి చేస్తున్నారు.

రాష్ట్ర సాయిలో ఐదవ స్థానంలోపు..

జిల్లాలో త్రైమాసిక, జీవిత కాల పన్నులు, వివిధ రకాల ఫీజులు, సర్వీస్ చార్జీలు, వాహనాల జరి మానాలు, అధిక లోడ్, పత్రాలు లేకుండా, డ్రైవర్ లైసెన్స్ లేకుండా తిరిగే వాహనాలకు జరిమానా లు, తనిఖీల ద్వారా మొత్తం రూ.60.50 కోట్లు వ సూలు చేశారు. ఆర్టీఏకు అత్యధికంగా ఆదాయం రావడమే కాకుండా రాష్ట్ర స్థాయిలో పన్నుల వసూళ్లలో 5వ స్థానం లోపు జిల్లా నిలిచింది.

నోటీసులు, కేసులు..



ఈ ఆర్థిక సంవత్సరం ముగియక ముందే 108 శాతం పన్నులు వసూళ్లు చేసి రాష్ట్రా స్థాయిలో ముందు వరసలో ఉన్నాం. విజిలెన్స్‌తోపాటు ఆర్టీఏ బృందాలు అధిక కేసులు రాయడంతోపాటు నోటీసులు జారీ చేయడంతో రవాణా శాఖకు వసూళ్లు పెరిగి లక్ష్యాన్ని దాటేశాం. జిల్లాలో నిత్యం ఆకస్మిక తనిఖీలు చేపడుతూ రెట్టింపు జరిమానాల ద్వారా భారీ వసూళ్లు చేపట్టాం. వాహనదారులు సైతం సకాలంలో పన్నులు చెల్లించడం కూడా లక్ష్యసాధనకు కారణంగా నిలిచింది.

– ఎల్.కిష్టయ్య, డీటీఓ, మంచిర్యాల

రవాణాశాఖ ఆదాయం(రూ.కోట్లలో)

	లక్ష్యం	వసూళ్లు	శాతం
త్రైమాసిక పన్నులు	10.23	13.27	129
లైఫ్ టాక్స్	34.86	33.58	96
ఫీజులు	6.50	8.73	134
సర్వీస్ ఫీజులు	2.43	1.96	80
కాంపౌండింగ్‌ఫీజులు	0.70	2.73	200
మొత్తం	55.86	63.50	108



రిజిస్ట్రేషన్‌కు వసూళ్లు..?

- రోజుకు 150కి పైగా రిజిస్ట్రేషన్లు
- వసూళ్ల వీడియో వైరల్



సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన అర్హులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు వీడియోలు వైరల్ కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. జిల్లాలోని బెల్లంపల్లి, నస్పూరు, మందమర్రి మండలాల్లో సుమారు 12 వేల మందిని అధికారులు గుర్తించారు. గతంలోనే నస్పూరు, మందమర్రికి చెందిన చాలావరకు స్థలాల క్రమబద్ధీకరణ రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. సింగరేణి, సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు త్వరగా చేసుకోవాలని అధికారులు తెలపడంతో మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రోజుకు 300కు పైగా ప్రజలు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉండి రిజిస్ట్రేషన్ చేసుకుని వెళ్తున్నారు. రోజుకు 100 నుంచి 120 వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తుండడంతో కొందరు వెనుదిరుగుతున్నారు. వీరితోపాటు రెగ్యులర్‌గా జరిగే రిజిస్ట్రేషన్లు 30కి పైగా అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బంది డబ్బు వసూళ్లకు తెరలేపారు. త్వరగా పని ముగించుకునేందుకు ఎంతో కొంత ముట్టజెప్పాలనే ఉద్దేశ్యంతో పలువురు సిబ్బందికి డబ్బులు ఇవ్వడంపై వీడియో వైరలైంది.

కొన్నింటికే రిజిస్ట్రేషన్లు...!

అనుమతి లేని లేఔట్లలోని ప్లాట్లు అమ్మేందుకు వీలు లేదు. కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కొన్ని ప్లాట్లు యధావిధిగా రిజిస్ట్రేషన్లు అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ప్లాటుకు రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో అనధికారికంగా వెలిసిన లేఔట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌లు రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఈ లేఖను అడ్డుపెట్టుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రూ.30 వేల నుంచి రూ. 50 వేలకు పెంచి మరీ వసూళ్లు చేసి రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పలువురు రియల్ వ్యాపారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



కార్యాలయంలోని సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణకు వచ్చేవారిలో ఒక్కొక్కరే కార్యాలయంలోకి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకున్నాం. సెలవుల్లో వెళ్లి మూడు రోజుల క్రితమే తిరిగి విధుల్లోకి చేరాను. అనుమతులు లేని లేఔట్లలోని ప్లాట్లు, గతంలో లేఔట్లు చేసి మిగిలిన ప్లాట్ల అమ్మకాలపై ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాల మేరకే రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుంది. కార్యాలయంలో ఎవరు డబ్బు వసూలు చేసినా, డిమాండ్ చేసినా ఫిర్యాదు చేయాలి.

– రేగళ్ల రాము, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్

'డెయిరీ' దుమారం !

- హాట్‌టాపిక్‌గా ఆర్జిన్ కంపెనీ వ్యవహారం
- పరస్పర ఆరోపణలతో వేడెక్కిన వైనం
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆర్జిన్ డెయిరీ నిర్వాహకులు చేస్తున్న ఆరోపణలు జిల్లాలో దుమా రం రేపుతున్నాయి. ఎమ్మెల్యేపై నేరుగా తీవ్ర స్థాయిలో ఆరోపణలు కలకలం రేపాయి. తనపై కుట్రపూరితంగానే ఇదంతా జరుగుతోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సైతం తమ ఎమ్మెల్యేపై కుట్ర పూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారని ప్రెస్‌మీట్‌లో వివరిస్తున్నారు. దీనిపై ఓ వైపు ప్రతిపక్ష నాయకులు, సోషల్ మీడియాలోనూ చర్చ జరుగుతోంది. జరుగుతున్న వ్యవహారమంతటిపై ఇంటెలిజెన్స్ వర్గాలు పలు కోణాల్లో ఆరా తీస్తున్నారు. మరోవైపు మంగళవారం ఆర్జిన్ డెయిరీ నిర్వాహకులు ఆదినారాయణ, షేజల్ వీడియోలు పలు ఉదయం నుంచి సాయంత్రం వరకు సోషల్ మీడియాలో వచ్చాయి. మొదట ఓ వీడియోలో తమని ఇబ్బంది పెడుతున్నట్లుగా ఆరోపించారు. మూడు రోజులపాటు టార్చర్ చేశారని పేర్కొన్నారు. సాయంత్రం మరో చోట ఓ వీడియోలో ఆ చాటింగ్ తెలియనట్లుగా చెప్పారు. దీంతో ఈ వ్యవహారం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

అధిష్టానం ఆరా

అధికార పార్టీ నేతపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు రావడంపై జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో చర్చకు దారి తీసింది. దీనిపై పార్టీ అధిష్టానం సైతం పలు వివరాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్ర స్థాయి ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం పలు విషయాలు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. గత జనవరిలో జరిగిన ఈ కేసులకు సంబంధించి ఇప్పుడు ఎందుకు బయటకు వస్తోంది..? కావాలనే ఎమ్మెల్యేను ఎవరైనా టార్గెట్ చేస్తున్నారా..? ఇందులో ఎవరి పాత్ర ఎంత..? ప్రతిపక్షాల విమర్శలకు తావిచ్చిన ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలతోపాటు ఆ డెయిరీ నిర్వాహకుల వైపు నుంచి ఆధారాలు తీసుకున్నట్లు సమాచారం.

రాజకీయ వర్గాల్లోనూ చర్చలు

ప్రైవేటు పాల డెయిరీ వ్యవహారంలో గత రెండ్రోజులుగా జరిగిన తీరంతా జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అటు అధికార పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనూ చర్చనీయాంశంగా మారింది. మరోవైపు వేరే నియోజకవర్గంలోని ఓ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జిన్ డెయిరీ నిర్వాహకుల నుంచి దాదాపు రూ.20లక్షల వరకు తీసుకుని తిరిగి గేదెలు ఇవ్వకపోవడం, దళితబంధు పేరుతో మభ్యపెట్టే ప్రయత్నాలు సైతం వివాదంలోకి వస్తున్నాయి. ఆ మార్కెట్ కమిటీ చైర్మన్, అతడి కొడుకు సైతం ఇక్కడ కీలకంగా ఉండి కథ నడిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన నియోజకవర్గ పరిధిలోని మరో ఎమ్మెల్యేను సైతం ఈ డెయిరీ వ్యవహారంలోకి లాగేందుకు ప్రయత్నించారు. అలాగే మరో నియోజకవర్గంలో యువ నాయకుడితోనూ దళితబంధు యూనిట్లపై చర్చించారు. అయితే ఆ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇటీవలే అక్రమంగా భూమి పట్టా రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో ఇరుక్కున్నారు. తాజాగా ఈ కేసులోనూ ఆయన క్రియాశీలకంగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అభివృద్ధి పనుల లక్ష్యాలు పూర్తి చేయాలి

- పన్నులు వంద శాతం వసూలు చేయాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



విద్యార్థులకు ప్రోత్సాహకం అందిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వైకుంఠధామం, పన్నుల వసూలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పారిశుధ్యం, ఉపాధి హామీ, ఎస్‌పీఏ బ్యాంకు లింకేజీ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైకుంఠధామాల్లో విద్యుత్, నీరు, మూత్రశాలలు, శౌచాలయాలు ఏర్పాటు చేసి ప్రజలు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పన్నులు వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. బృహత్ పల్లెప్రకృతి వనాల ఏర్పాటులో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.రా హుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జి ల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థుల ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతిభా ప్రోత్సాహక పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన, ప్రోత్సాహక కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమితో కలిసి హాజరయ్యారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక పురస్కారాలు అందజేశారు. అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి ఉచితంగా చదివించడానికి అవినాష్ కాలేజెస్ ఆఫ్ కామర్స్ హైదరాబాద్ అడ్మిషన్ ఉచితంగా ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు, అవినాష్ కాలేజెస్ ఆఫ్ కామర్స్ ప్రొఫెషనల్ కోర్సెస్ హెడ్ డాక్టర్ సాయికుమార్, డైరెక్టర్ సంతోష్, జిల్లా ఉమ్మడి పరీక్ష విభాగం కార్యదర్శి భీంరావు, సహాయ కార్యదర్శి దేవసాని కుమారస్వామి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

'అభివృద్ధికి దూరంగా నస్పూర్ మున్సిపాలిటీ'



ధర్నాలో మాట్లాడుతున్న రఘునాథ్

నస్పూర్: కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో నస్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి దూరంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆరోపించారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నా యకులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ టీఆర్ఎస్ కౌన్సిలర్లు అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకుండా ప్రజల వద్ద అక్రమ వసూళ్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. పట్టణంలోని ప్రతీ వార్డులో మంచినీరు, డ్రైనేజీ సమస్య ఉందని తెలిపారు. శాశ్వత డంపింగ్ యార్డ్ లేక కాలనీల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీసీసీ కార్నర్ శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అగల్‌డ్యూటి రాజు, ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, నాయకులు మోటపలుకుల తిరుపతి, మిట్టపల్లి మొగిళి, తిప్పని భీమయ్య, సిరికొండ రాజు, రావనవేన భీమయ్య, కొండ వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి మూడో జోన్ పోచమ్మ గుడి సమీపంలోని తన ఇంట్లో పిట్టల కుమార్ (38) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చంద్ర కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమార్‌తో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్న తల్లి అనసూర్య సోమవారం రాత్రి పెద్ద కుమారుడి ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం అనసూర్య ఇంటికి రాగా కుమార్ చీరెతో ఉరేసుకుని మృతి చెంది కనిపించాడు. పెళ్లి కావడంలేదని మనస్తాపం చెంది కుమార్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెంకటమ్మకు త్వరలో పింఛన్

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: కొల్లూర్ గ్రామానికి చెందిన బెల్లంపల్లి వెంకటమ్మ భర్త రెండేళ్ల క్రితం మృతి చెందగా ఆమె వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఏళ్లు గడిచినా పింఛన్ మంజూరు కాలేదు. అంతే కాకుండా తాను చనిపోయినట్లు రికార్డుల్లో ఉండడంతోనే పింఛన్ మంజూరు కావడంలేదని అధికారులు తెలిపారని వెంకటమ్మ వాపోయింది. దీంతో ఈ విషయమై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'బతికుండగానే చంపేశారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీపీ మంత్రి సురేఖ స్పందించారు. ఎంపీడీవో భాస్కర్ దృష్టికి సమస్య తీసుకువెళ్లి పింఛన్ మంజూరు చేయించాలని కోరారు. వెంకటమ్మ బతికున్నట్లు రికార్డుల్లో మార్చాలన్నారు. దీంతో రికార్డులు సరిచేస్తామని, త్వరగా పింఛన్ మంజూరు చేయిస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దండేపల్లి: మండలంలోని ద్వారక గోదావరి తీరం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ బాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలప పట్టివేత

నెన్నెల: మండల కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో మొండమ్మ తోట వద్ద మంగళవారం తెల్లవారుజామున ఎడ్లబండ్లలో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను పట్టుకొని నెన్నెల రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు కుశ్నపల్లి రేంజ్ అధికారి గోవిందచంద్ సర్దార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖర్జీ నుంచి నెన్నెలకు మూడు ఎడ్లబండ్లలో 28 టేకు దుంగలు తరలిస్తున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.40 వేల వరకు ఉంటుందని చెప్పారు. కలప తరలిస్తున్న ఎడ్లబండ్లతో పాటు ఖర్జీ గ్రామానికి చెందిన గడ్డం తిరుపతిగౌడ్, చింత లచ్చమ్మ, రావుల ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా కలప తరలించినా, విద్యుత్ వైర్లు అమర్చి, ఉచ్చు బిగించి వన్యప్రాణులను వేటాడినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. నెన్నెల డెప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, బీట్ ఆఫీసర్ రజిని, డ్రైవర్ సుమన్, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు.

మోసాలు చేసి ఎమ్మెల్యేపై విమర్శలా!



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, పక్కన పార్టీ నాయకులు

- డెయిరీ నిర్వాహకులపై బీఆర్ఎస్ ఆగ్రహం
- ఆరోపణలు అవాస్తవమన్న నేతలు

బెల్లంపల్లి: రైతులను మోసం చేసి జైలుకు వెళ్లిన ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గెల్లి రాజలింగు పేర్కొన్నారు. మంగళవారం పద్మశాలీ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఆరిజిన్ డెయిరీ ఏర్పాటు చేసి రైతులను నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.3.50 లక్షలలోపు వసూలు చేశారని ఆరోపించారు. రైతులకు పాడి గేదెలు ఇవ్వకుండా మోసం చేసినందుకే పోలీసులు నిర్వాహకులను అరెస్ట్ చేశారని తెలిపారు. ఆరిజిన్ డెయిరీ నిర్వాహకుడు కందిమళ్ల ఆదినారాయణ, ఓ మహిళపై ఉమ్మడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల పోలీస్‌స్టేషన్లలో రైతులను మోసం చేసిన కేసులు నమోదయ్యాయని వివరించారు. ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు, మరికొందరు కల్పితాలతో ఆడియో, వీడియో టేపుల ద్వారా ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేసి ఆనందపడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చిన్నయ్యపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బొడ్డు నారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు నెల్లి శ్రీలత, తడక పద్మావతి, తుంగపల్లి సుజాత, దామెర శ్రీనివాస్, రాములునాయక్, సోమగూడెం సర్పంచ్ ప్రమీల గౌడ్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకటేశ్, మాజీ కౌన్సిలర్లు జిలకర వాసు, రేవెల్లి విజయ్‌కుమార్, ఎలిగేటి శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల బాధ్యులున్నారు.

'తప్పు చేయలేదని ఎమ్మెల్యే నిరూపించుకోవాలి'



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ఏమాజీ

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనకు తాను నిరూపించుకోవాలని బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే చిన్నయ్య తానొక ప్రజాప్రతినిధిననే విషయాన్ని మరిచి ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. డెయిరీ ఏర్పాటుకు భూమి అప్పగిస్తానని నమ్మించి రూ.20లక్షలు తీసుకుని ఎమ్మెల్యే మోసం చేసినట్లు సదరు నిర్వాహకులు చెబుతున్నారని పేర్కొన్నారు. తనకు అమ్మాయిలు కావాలని కోడ్ బాషలో వాట్సాప్ చాటింగ్ చేయడం, లైంగికవాంఛ తీర్చుకోవడం లాంటి చర్యలు అసహ్యం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఎమ్మెల్యే కార్యాలయాలను ఆడియో, వీడియోల ద్వారా బహిర్గతం చేస్తున్నారని, వాటిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని తెలిపారు. నిజానిజాలు బహిర్గతం కావాల్సిన అవసరం ఉందన్నారు. లైంగిక వేధింపులకు గురి చేస్తున్న ఎమ్మెల్యే తీరును ప్రజలు ఈసడించుకుంటున్నారని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై వ్యాఖ్యలు చేస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌కు నోటీసులు జారీ చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ఎమ్మెల్యే చిన్నయ్యపై కొందరు మహిళలు చెబుతుంటే ఎందుకు నోటీసులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మహిళా కమిషన్ ద్వంద్వ విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. చిన్నయ్య ఆడియో, వీడియో టేపులు బహిర్గతమవుతున్న దృష్ట్యా వెంటనే రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించి సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ జరిపించాలన్నారు. ఎమ్మెల్యేపై లైంగికదాడికి యత్నంకేసు నమోదు చేసి బాధిత మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు బీ కేశవరెడ్డి, పుల్లం తిరుపతి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాజులాల్‌యాదవ్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి శ్రావణ్ తదితరులున్నారు.

భర్తను హత్య చేసిన భార్య రిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తంగళ్లపల్లి–కోనూరు గ్రామానికి చెందిన దుంపటి మహేశ్‌ను హత్య చేసిన అతడి భార్య లావణ్యను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లావణ్యకు 14 ఏళ్ల క్రితం మహేశ్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. మహేశ్ కొన్నేళ్లుగా మద్యానికి బానిసై లావణ్యను హింసిస్తున్నాడు. దీంతో లావణ్య గతంలో రెండుసార్లు కట్టెతో మహేశ్‌పై దాడి చేసింది. భర్త పెట్టే హింస భరించలేక ఎలాగైనా అతడిని చంపాలని అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ఈ నెల 26న సాయంత్రం మహేశ్ తాగి వచ్చి లావణ్యతో గొడవపడ్డాడు. దీంతో ఇదే సరైన సమయంగా భావించిన లావణ్య ఇనుప రాడ్‌తో మహేశ్ తలపై బలంగా కొట్టింది. తల పగలగా తీవ్ర రక్తస్రావమై మహేశ్ మృతి చెందాడు. విచారణ చేపట్టిన పోలీసులు లావణ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్సై విజయేందర్ పాల్గొన్నారు.

కలమడుగు విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

జన్నారం: జిల్లా కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షలో మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. శ్రీరాముల సంహిత జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలువగా, కల్లెడ శివనందిని నాలుగోస్థానంలో నిలిచింది. మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సంతోష్‌నాయక్ వారికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ట్రైనీ కలెక్టర్ గౌతమి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

జన్నారం: నీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని పొనకల్ శ్రీరాంనగర్ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం రామాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. వీరికి కాంగ్రెస్, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 20 రోజులుగా నీటి కోసం ఇబ్బందులు పడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లాలు బిగించి ట్యాంక్ నుంచి నీరు సరఫరా చేయడం లేదని వాపోయారు. ఎండలు ముదురుతుండగా నీటి సమస్య ఎక్కువైందని తెలిపారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్య పరిష్కరించేదాకా ఆందోళన విరమించబోమని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై సతీశ్ అక్కడికి చేరుకుని మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమిరా అన్నారు. కాగా, రెండురోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామని ఎంపీపీ సరోజన ఫోన్‌లో హామీ ఇవ్వగా వారు రాస్తారోకో విరమించారు. వివిధ పార్టీల నాయకులు ఫసీఉల్లా, రాజన్న, కాలనీవాసులు రాజన్న, సందకృష్ణ, మల్లయ్య, చిలువేరు గంగమణి, పిల్లి సుజాత, సంద వనిత, మహిళలు పాల్గొన్నారు.

31లోపు పట్టాల కోసం డీడీలు చెల్లించాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

రామకృష్ణాపూర్: సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని పట్టాలు పొందాలనుకునేవారు ఈ నెల 31వ తేదీలోపు డీడీలు చెల్లించాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో సమీక్షా నిర్వహించారు. జీవో నెం 76 ప్రకారం సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్నవారు రామకృష్ణాపూర్ పట్టణంలో దాదాపు అందరూ డీడీలు కట్టి రిజిస్ట్రేషన్‌లు కూడా పూర్తి చేసుకున్నారని, ఇంకా 555 మంది డీడీలు కట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఇదివరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 31 తర్వాత మళ్లీ అవకాశముండదని, 555 మంది డీడీలు కట్టేలా ఆయా వార్డుల కౌన్సిలర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మంచిర్యాల ఆర్డీవో వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువ విజ్ఞానిని సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: యువత సైన్స్, టెక్నాలజీలో ముందుకుసాగాలనే ఉద్దేశంతో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ఇస్రో 'యువ విజ్ఞాని' పేరిట యువిత అనే ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి దశ నుంచే బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు క్యాచ్ యంగ్ నినాదంతో యువికా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇస్రో మంచి అవకాశాన్ని కల్పించిందని, శిక్షణ పొంది శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఏప్రిల్ 3వ తేదీలోగా http://www.isro.gov.in/YUVIKA.html లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు మే 15వ నుంచి 26వ తేదీ వరకు 'సైన్స్, పరిశోధన అంశాలపై అన్ని వసతులు కల్పించి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, అంతరిక్ష పరిశోధనా రంగాల్లో ఆసక్తి పెంచేందుకు దోహదపడుతుందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబును 9849550200 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వభూమిలోని నిర్మాణాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



ఫెన్సింగ్‌ను జేసీబీ సాయంతో తొలగింపజేస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. 'ఆగని భూ ఆక్రమణలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు మంగళవారం స్పందించారు. ప్రభుత్వ భూమిచుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ని అధికారులు జేసీబీ సాయంతో తొలగింపజేశారు. వివరాలు.. నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 119లోని సుమారు ఎకరం ప్రభుత్వ భూమి చుట్టూ కొందరు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి దానిని కబ్జా చేశారు. 'సాక్షి' దీనిని వెలుగులోకి తేగా స్పందించిన అధికారులు ప్రభుత్వ భూమి చుట్టూ ఏర్పాటు వేసిన ఫెన్సింగ్‌ను జేసీబీ సాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మాట్లాడారు. పట్టణంలో ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచిర్యాల ఆర్డీవో వేణు, తహసీల్దార్ జ్యోతి, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో చైన్ స్నాచింగ్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం భాగ్యనగర్ ట్రైన్‌కు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికురాలి మెడలోని పుస్తెలతాడును గుర్తు తెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. జీఆర్పీ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా కుమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన నాగుల జ్యోతి రెండు రోజుల క్రితం మంచిర్యాలలోని హమాలీవాడలో ఉంటున్న తల్లి, అన్నయ్య కుమార్ దగ్గరికి వచ్చింది. తిరుగుప్రయాణంలో భాగ్యనగర్ ట్రైన్‌కు మంగళవారం వెళ్లేందుకు జ్యోతి, హారికతో కలిసి హమాలీవాడ వైపు ఉన్న మెట్ల పైనుంచి వస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి జ్యోతి మెడలోని బంగారు పుస్తెల తాడు ఎత్తుకెళ్లాడు. పుస్తెల తాడు 15 గ్రాములు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న శేషాద్రి

దండేపల్లి: మహిళలు స్వయం ఉపాధి శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. దండేపల్లి ఆదర్శ వయోజన విద్యాకేంద్రంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సౌజన్యంతో మహిళలకు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రుణాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు ప్రకాశం, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం, జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి వెంకటరమణ, దళిత అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, తహసీల్దార్ హనుమంతరావు, డీఆర్పీలు జనార్దన్, వెంకటేశ్వర్లు, తిరుపతి, అశోక్‌రావు, శిక్షకురాలు ఉమాదేవి మహిళలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



బీరయ్య (ఫైల్)

వేమనపల్లి: మండలంలోని రాజారాం గ్రామానికి చెందిన గాదర్ల బీరయ్య (22) అదృశ్యమయ్యాడు. గత శుక్రవారం అర్ధరాత్రి భార్యకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోగా ఐదు రోజులుగా కుటుంబ సభ్యులు అతడి కోసం బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో గాలిస్తున్నారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. అతడికి భార్య మమత, కొడుకు అద్విత్ ఉన్నారు. యువకుడి అదృశ్యంపై నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మౌఖికంగా బీరయ్య అన్న రమేశ్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీరయ్య ఆచూకీ తెలిస్తే 8886044664, 9391169601 నంబర్లకు సమాచారం తెలుపాలని సూచించారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, చైర్మన్, కార్యదర్శులను తొలగించాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ.. లక్షల మంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో తిండీతిప్పలు, నిద్రాహారాలు మాని చదువుతున్నారని, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, చైర్మన్, కార్యదర్శులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు చెవుటు మల్లేష్, అభినవ్, వెంకటేశ్, రాకేశ్ తదితరులున్నారు.

ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం

- వందేళ్లుగా వెలుగుతున్న అఖండదీపం



ఆలయంలో వెలుగుతున్న అఖండదీపం




సుద్దాలలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

చెన్నూర్‌రూరల్: సుద్దాల గ్రామంలోగల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దాలకు వచ్చిన ఒక ముని వాగు ఒడ్డునున్న చింత చెట్టు కింద సీతారాములు, లక్ష్మణుడు, ఆంజేయస్వామి రాతి విగ్రహాలను బయటకు తీశాడు. అక్కడే వాగు ఒడ్డునే ఒక పందిరి వేసి విగ్రహాలను ప్రతిష్ఠించాడు. చెన్నూర్ పట్టణానికి చెందిన రామగుడు కిష్టయ్య అనే భక్తుడి కలలో శ్రీరాముడు కనిపించి తనకు ఆలయాన్ని నిర్మించాలని కోరగా అతను గ్రామస్తుల సహాయంతో డంగు సున్నంతో 1910లో ఆలయాన్ని నిర్మించారు. అలాగే సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయుల పంచలోహ విగ్రహాలను తెప్పించి ఈ ఆలయంలో ప్రతిష్ఠించారు. అప్పుడు ఆయన వెలిగించిన అఖండ దీపం ఇప్పటికీ వెలుగుతూనే ఉంది. ఏటా ఇక్కడ శ్రీరామనవమి పర్వదినాన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఏడు రోజులు పాటు నాగవెల్లి తదితర ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కు తీర్చుకుంటారు.

30న కల్యాణ మహోత్సవం..

ఈనెల 30 గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకొని ఇక్కడ అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముడుపు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. కాగా, ఈ ఆలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందని, కోరిన కోర్కెలు తీరుతాయని ఆలయ అర్చకుడు మహేందర్‌శర్మ తెలిపారు.

భీమారం కోదండరామాలయంలో..



భీమారం: మండల కేంద్రంలో ముస్తాబైన రామాలయం

భీమారం: చెన్నూరు ప్రాంతంలోనే ప్రసిద్ధి గాంచిన భీమారం శ్రీకోదండరామాలయాన్ని శ్రీరామనవమి ఉత్సవాలకోసం ముస్తాబు చేశారు. 40 ఏళ్లక్రితం నిర్మించిన ఆలయంలో ఏటా పెద్దఎత్తున నవమి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. శ్రీసీతారామ కల్యాణం కోసం ఈసారి ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సుమారు 5వేల మంది భక్తులు హాజరవుతారని, ఈమేరకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.